www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబరు 2024

5

పశ్చిమ గోదావరి



రెండో రోజు కొనసాగిన ఆందోళన

ఎంఎల్ఎ హామీతో విరమణ

నరసాపురం: మండలంలోని రుస్తుంబాద మండా వారి పేటలో డంపింగ్ యార్డు ఆందోళన రెండోవ రోజు ఆదివారం కొనసాగింది. పురపాలక సంఘానికి సంబందించిన డంపింగ్ యార్డును మా గ్రామంలో వద్దంటూ మంగళగుంటపాలెం గ్రామస్థులు రెండు ట్రాక్టర్‌లపై ఊరేగింపుగా నరసాపురం జనసేన పార్టీ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. పురుగుల మందు డబ్బాలు చేతబట్టి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఆ సమయంలో ఎంఎల్‌ఎ నాయకర్ స్థానికంగా లేరు. కార్యాలయంలో ఉన్న జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, గంటా కృష్ణలు గ్రామస్థులకు సద్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎంఎల్ఎ వచ్చే వరకు ఆందోళన విరమించమని భీష్మించారు. దీంతో ఎంఎల్ఎ గ్రామస్థులతో ఫోన్లో మాట్లాడారు. సోమవారం మీ గ్రామస్థులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాసాని సత్యనారాయణ, కర్రి రాంబాబు, లక్ష్మి దుర్గా, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో..

సమస్యలు తీరేనా..!

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారుల ప్రణాళికలు

రెండు జిల్లాల్లో 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

511 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు

గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులపై స్పష్టత కరువు

తూకం, తేమశాతంపై కచ్చితమైన ప్రకటన నిల్

ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం గుర్తించిందా? గతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందా? తేమ, తూకంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు తీసుకున్న చర్యలు ఏంటి? అన్న ప్రశ్నలు అన్నదాతను వేధిస్తున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై ముందస్తు ప్రణాళికలకు అధికారులు సిద్ధమవ్వడంతో రైతుల్లో ధాన్యం కొనుగోలుపై చర్చ మొదలైంది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు గుర్తించి.. రైతులకు సులువుగా ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ రెండోవారం నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నులు, 'పశ్చిమ'లో 5.30 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో 247, పశ్చిమలో 264 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ వరకూ భాగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు సంబంధించి అధికారుల సమావేశాల్లో స్పష్టత రాని పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం విక్రయించడం రైతులకు పెద్ద సమస్యగా ఉండేది. రైతులు ధాన్యం మాసూళ్లు చేసిన తర్వాత, ఆరబెట్టి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకున్న తర్వాత సంచులు సకాలంలో అందేవి కావు. ధాన్యం మిల్లుకు తరలించేందుకు వాహనాల్లేక నానా యాతన పడేవారు. మిల్లు వద్దకు ధాన్యం చేరిన తర్వాత తూకం సరిపోలేదని, తేమ శాతం ఎక్కువగా ఉందని రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. డబ్బులు ఇవ్వకపోతే ధాన్యం దిగుమతి చేసుకునేవారు కాదు. ధాన్యం సొమ్ములు తొలుత వేగంగా జమైనప్పటికీ తర్వాత నెలల తరబడి జమచేయని పరిస్థితి కొనసాగేది. దీంతో రైతులకు ధాన్యం అమ్ముకోవడం ఒక యజ్ఞంలా మారేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ధాన్యం కొనుగోలులో సమస్యలు లేకుండా చూస్తామంటూ రైతులకు భరోసా ఇచ్చింది. ధాన్యం కొనుగోలుపై అధికారులు చేస్తున్న సమీక్షా సమావేశాల్లో వారు ఎదుర్కొన్న సమస్యలపై పరిష్కారం మాత్రం స్పష్టంగా చెప్పడం లేదన్న చర్చ నడుస్తోంది.

తేమ, తూకంపై స్పష్టత లేదాయే..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రం అధికారులు వచ్చి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించేవారు. 17 శాతంలోపు తేమశాతం ఉందని గుర్తించిన తర్వాత ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత తేమశాతం ఎక్కువగా ఉందని, మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకునేవారు కాదు. తేమశాతం అధికంగా ఉందంటూ పాయింట్ల వారీగా రైతుల నుంచి సొమ్ములు వసూలు చేసేవారు. రైతు భరోసా అధికారులు తేమ శాతం నిర్ధారించిన తర్వాత తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు ఏవిధంగా చెబుతారో ఏ ఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ప్రభుత్వ అధికారులు తేమ శాతం నిర్ధారించిన తర్వాత కూడా మిల్లర్లు అందుకు విరుద్ధంగా వ్యవహరించి రైతుల నుంచి అడ్డంగా దోచుకున్న పరిస్థితి నెలకొంది. జిల్లా పరిషత్ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు అనేకసార్లు అధికారులను నిలదీసిన పరిస్థితి సైతం కొనసాగింది. రైతు సేవా కేంద్రంలోని అధికారులు తేమశాతం గుర్తించాక మిల్లర్లు అడ్డంకులు సృష్టించకుండా తీసుకున్న చర్యలు ఏంటో అధికారులు చెప్పాల్సి ఉంది. రైతు భరోసా కేంద్రం అధికారులు తూకం నిర్ధారణ చేసిన తర్వాత తూకం తక్కువగా చూపించి రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని నివారించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో కూడా అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. సంచులు, వాహనాల విషయంలో అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి భిన్నంగా కొనసాగేది. ఈ సారి అటువంటి పరిస్థితి రాకుండా ఏవిధంగా ముందుకు సాగుతారో తేల్చి చెప్పాల్సి ఉంది. కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి. 48 గంటల్లో ధాన్యం సొమ్ములు జమ కావాలంటే, ఆన్‌లైన్ విధానం ఏవిధంగా త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటో రైతులకు వివరించాల్సి ఉంది. గతంలో నెలకొన్న సమస్యలపై స్పష్టత ఇచ్చి రైతులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే అవే సమస్యలతో రైతులు మళ్లీ ఇబ్బందులు పడాల్సి వస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ పాలనలో ఇంజినీరింగ్ వ్యవస్థ నాశనం

రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టుతో పాటు అన్ని ప్రాజెక్టులు, జలాశయాలు, కాలువలు విధ్వంసానికి గురయ్యాయని రాష్ట్ర జలవన వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా సర్వనాశనమైందన్నారు. పాలకొల్లు ఇరిగేషన్ లాకులు ప్రాంతంలో ప్రముఖ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జరిగిన సభలో మంత్రి పాల్గొన్నారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి, కాటన్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖలో ఉద్యోగ విరమణ చేసిన ఇంజినీర్లను, సీనియర్ ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కెఎల్.రావు, విశ్వేశ్వరయ్య, కాటన్, శివ రామకృష్ణయ్య వంటి ప్రముఖ ఇంజినీర్లు ఆత్మ క్షోభించేలా ఐదేళ్ల జగన్ పాలనలో ఇరిగేషన్ విధ్వంసానికి గురైందన్నారు. పరిపాలన దక్షత గల చంద్రబాబు సిఎంగా ఉండబట్టే అన్నమయ్య ప్రాజెక్టులా బుడమేరును గాలికొదిలేయలేదన్నారు. వర్షాలు, వరదలు, నీరు తగ్గే వరకూ పనులేమీ చేయలేమని స్వయంగా జగన్ చెప్పారన్నారు. జగన్ సిఎంగా ఉంటే బుడమేరు, ఏలేరు జలాశయం ముంపు బాధితులకు పునరావాసం, సహాయ కార్యక్రమాలు కూడా జరిగేవి కావని మంత్రి తెలిపారు. విజయవాడ, ఏలేరు వరద ముంపునకు కారణమైన జగన్‌కు పర్యటించే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.



ఆర్ఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతులు, గ్రామ నాయకులు

ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగారాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని 19 ఏళ్లలోపు పిల్లలు ఆల్ బెండజోల్ మాత్రలు తప్పక వేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అన్ని శాఖలూ సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ముమ్మర పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్లో అధికారులతో ఆమె మాట్లాడారు. బాల బాలికల్లో రక్తహీనతకు ప్రధానంగా జీర్ణవ్యవస్థలో చేరిన నులిపురుగులు కారణమౌతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఏటా జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని ఉద్యమ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1,617 అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల కింద 1,894 పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలలు 165, సాంకేతిక విద్యా సంస్థలతో పాటు బడిలో నమోదుకాని బాలలు, వెరసి 1 నుంచి 19 ఏళ్ళు కలిగిన సుమారు 3,64,400 మంది బాల బాలికలందరికీ ఈ నెల 17వ తేదీన నిర్దేశిత మోతాదు, విధానం ప్రకారం ఆల్ బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆల్ బెండజోల్ మాత్రల పంపిణీతో పాటు ఆహారం తీసుకునే ముందు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుగుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం, చెప్పులు ధరించడం వంటి ఆరోగ్య అలవాట్ల గురించి పిల్లలందరికీ తప్పనిసరిగా ప్రదర్శన పూర్వకంగా వివరించాలన్నారు. 17వ తేదీన ఏ కారణం చేతైనా మాత్రలు వేసుకుని పిల్లలు మిగిలిపోతే అటువంటి వారందరికీ కూడా మాప్ అప్ కార్యక్రమాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఏ ఒక్కరూ మాత్రలు మిస్ కాకూడదన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపల్స్ ఈ నెల 30వ తేదీన తమ విద్యా సంస్థల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామనే ధ్రువీకరణ తమకు సమర్పించాలన్నారు. ఆరోగ్యవంతమైన భావిపౌరులను దేశానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఆర్ఎస్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మాజీ ఉప సర్పంచి వైజాగ్ రాజు

ప్రజాశక్తి - యలమంచిలి

ఆర్ఎస్ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఉప సర్పంచి వైజాగ్ రాజు తెలిపారు. చించినాడ గ్రామంలోని మాజీ ఉపసర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు (వైజాగ్ రాజు) అతిథిగృహం వద్ద ఆదివారం స్థానిక రైతాంగం ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపసర్పంచి వైజాగ్ రాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. 65 సంవత్సరాల పాటు చించినాడ గ్రామాన్ని పంచాయతీని ఏక చక్రాధిపత్య పరిపాలన కొనసాగించడానికి ఆర్ఎస్ చేసిన కృషి మాటల్లో వర్ణించలేమన్నారు. ఆయన పార్టీ బాధ్యతలు రీత్యా ఎక్కడ ఉన్నా చించినాడ గ్రామాభివృద్ధికి పరితపించి గ్రామ సర్వతోముఖాభివృద్ధి సాధించే విధంగా కృషి చేశారని తెలిపారు. చించినాడ గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ వంతమైన పంచాయతీగా నిలిపారని తెలిపారు. అదే స్థాయిలో ఆయన తర్వాత గ్రామానికి సుదీర్ఘకాలం పాటు సర్పంచిగా పనిచేసిన ఆర్ఎస్ సోదరుడు సూర్యనారాయణ రాజు, మాజీ సర్పంచి కేతా సూర్యారావు వంటి ఉద్ధండుల నాయకత్వం వల్ల చించినాడ అనేక ఏళ్లపాటు అప్రతిహాసంగా ముందుకు దూసుకెళ్తూ అభివృద్ధి సాధించగలిగిందని తెలిపారు. అటువంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు (అజంతా రాజు), మాజీ ఉపసర్పంచి రుద్రరాజు సత్యనారాయణ రాజు (పెదబాబు), రుద్రరాజు చినవర్మ, అల్లూరి రామకృష్ణంరాజు, రుద్రరాజు కాశీ విశ్వనాథరాజు, నాయకులు కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, మల్లుల పుల్లారావు, తెన్నేటి స్టాలిన్, మల్లుల చిట్టియ్య, బూసి రత్నంరాజు, రేపూరి శ్రీనివాస్, సిరాల రవి, రిటైర్డ్ టీచర్ ఈదా సంపతరావు పాల్గొన్నారు.

అమరజీవి సీతారాం ఏచూరి..



తాడేపల్లిగూడెం : రైల్వే గూడ్స్ వర్కర్స్ ఆధ్వర్యాన నివాళులు..

ప్రజాశక్తి - ఉండి

అమరజీవి సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివని, అటువంటి నాయకున్ని కోల్పోవడం బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ అన్నారు. ఆదివారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో పార్టీ గ్రామ కార్యదర్శి పెల్లూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు దండు రామలింగరాజు, కిలారి తవిటినాయుడు, సోడదాసి గంగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ధనికొండ శ్రీనివాస్, ఆకుల హరే రామ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సీతారాం ఏచూరి వామపక్ష భావాలకు ఆకర్షితులయ్యారని, ఆయన అకుంఠిత దీక్ష వల్లనే మూడుసార్లు పార్టీ జాతీయ కార్యదర్శిగా ఎంపికయ్యారన్నారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యునిగా తనదైన శైలిలో ప్రజాసంస్థలపై పోరాడారని కొనియాడారు. పార్టీ నాయకులు చిట్టి అన్నవరం, సోడదాసి రాంబాబు, జి.పోతురాజు, డొల్ల రాజు, మాదాసిరామయ్య, గొంతే హరీష్, పెళ్లూరి అప్పన్న, పి.అవ్వమ్మ, పి.వెంకటరమణ, పి.మార్తమ్మ, సత్యవాణి, అనురాధ, మేడపాటి ప్రశాంత్, సోడదాసి శ్రీనివాస్, కృపారావు పాల్గొన్నారు.



ఉండి : సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి పూలమాలవేసి గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ తరపున నివాళులు అర్పించారు. అనంతరం సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఆయన మృతి కార్మికవర్గానికి, రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు తీరని లోటు అని తెలిపారు. ఈ సంతాప సభలో ఎస్‌విఎస్.రెడ్డి, కరిసాయిరెడ్డి, ఆకుల నారాయణ, కర్రి సుబ్బిరెడ్డి, ఆడప ఆంజనేయులు, కర్రి శ్రీనివాస్ రెడ్డి, అడ్డగర్ల కృష్ణ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : సిపిఎం ఆధ్వర్యాన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి, ఆర్ఎస్‌కి ఘనంగా నివాళులర్పించారు. భీమవరం మండలం రూరల్ తోటిప్ప గ్రామంలో ఆదివారం సీతారాం ఏచూరికి, ఆర్ఎస్‌కి చిత్రపటాలకు పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి మన్ననలు పొందిన సీతారాం ఏచూరి తెలుగువారు కావటం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శి బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరావు, తిరుమణి నాగేశ్వరావు, తిరుమణి సూర్యనారాయణ పాల్గొన్నారు.



భీమవరం టౌన్ : నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య శాఖ అధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

అనుకోకుండా సంభవించే పాము కాటు వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖాధికారి డి.మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాము కాటు వల్ల సరైన అవగాహనా లేకపోవడం వల్ల ప్రజలు మరణాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పాముల్లో ఎక్కువుగా విషరహిత సర్పాలే ఉంటాయని తెలిపారు. విష పూరితమైనవి నాలుగైదు జాతులు మాత్రమే ఉన్నాయన్నారు. పాములు కరచినప్పుడు కంగారు పడకుండా జాగ్రతలు పాటిస్తే ప్రాణాలను కాపాడుకోవ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము కాటుకు విరుగుడు వ్యాక్సిన్లు (యాంటీ స్నేక్ వీనం) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాముకాటుకు గురైనప్పుడు వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. అంతేగాని పల్లెటూళ్లల్లో ఉండే మంత్రాలూ, ఆకుపసరులు వేసి నాటు వైద్యులులను ఆశ్రయించవద్దని తెలిపారు. పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన ఉన్న పొదలను, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అనవసరమైన వస్తువులను తొలగించుకోవాలని తెలిపారు.

బాబాయ్ లేని లోటు తీరనిది

సంతాప సభలో వక్తలు



సంతాప సభలో మాట్లాడుతున్న గోపాలన్

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం పట్టణ కమిటీ సభ్యుడు పొన్నాడ రాము సంతాప సభ ఆదివారం 22వ వార్డులో బాబాయ్ స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరికీ బాబాయిగా మంచి సుపరిచితమైన వ్యక్తి అని, బాబాయి గురించి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి నుంచి పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఆయన పనిచేశారని, ఒక కార్మికుడిగా మొదలుపెట్టి చివరి వరకు కూడా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా కొనసాగి, తాను తుదిశ్వాస విడిచారన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శిగా స్కీం వర్కర్స్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని, తన పని తాను చూసుకుని మిగిలిన సమయం అంతా పార్టీ కార్యక్రమాల కోసమే తాను వెచ్చించారన్నారు. కష్టాలు, ఇబ్బందులు ఉన్న పార్టీని వదిలిపెట్టలేదని, అలాంటి మంచి వ్యక్తిని పోగొట్టుకోవటం పార్టీకి తీరని లోటని తెలిపారు. సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు కవులు పెద్దిరాజు మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి పొన్నాడ రాము లేని లోటు కనపడుతుందన్నారు. మంచి వర్కర్‌గా మంచి పేరు ఉందని, కార్యక్రమం అనేసరికి ముందు పీఠిన నిలబడి జెండాలు దగ్గర్నుంచి అన్నీ తానే సమకూర్చి, కార్యక్రమం దిగ్విజయంగా జరిగేటట్లు చూసేవారన్నారు. తాను లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిదని, పార్టీకి ఎనలేని సేవలు చేశారని ఆయన అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ బాబాయితో పరిచయం చాలా కాలమైనా కలిసి మెలిసి పనిచేశామన్నారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని, పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు నారాయణరావు, నరసాపురం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు, మొగల్తూరు మండల కార్యదర్శి యడ్ల చిట్టిబాబు, యలమంచిలి మండల కార్యదర్శి కానేటి బాలరాజు, చెన్నూరి పెద్దిరాజు, బద్రిరాజు ఈ సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వర్ణలతకు నంది అవార్డు ప్రదానం


వెల్లువలా కురిసిన అభినందనలు



అవార్డు అందుకుంటున్న స్వర్ణలత

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సా కోడేరు గ్రామానికి చెందిన డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు తెలుగు వెలుగు సాహితీ నంది అవార్డు లభించింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం తెలుగు వెలుగు సాహితి నంది అవార్డును పూర్వ నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు, జాతీయ సంస్థ అధ్యక్షులు సోలోజు రాజ్ కుమార్ చేతుల మీదుగా స్వర్ణలతకు ప్రదానం చేశారు. స్వర్ణలత 2001లో సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి దాని ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. వేలాదిమంది విద్యార్థులకు మానసిక వికాసం, విద్యా నైపుణ్యత తరగతులు నిర్వహిస్తూ వాటి ద్వారా విద్యార్థులకు విద్య పట్ల శ్రద్ధ కలిగించే అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా స్వర్ణలత రచించిన మైండ్ పవర్ అనే బుక్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారడంతో పాటు జీవన శైలికి దగ్గరగా మారింది. ఈ నేపథ్యంలో స్వర్ణలత సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించిన తెలుగు వెలుగు సాహితి వేదిక అధ్యక్షులు సోలోజు రాజ్ కుమార్ నంది అవార్డు అందించినట్లు తెలిపారు. అవార్డు అందుకున్న స్వర్ణలతను సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విస్సాకోడేరు గ్రామస్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.


నివాళులర్పిస్తున్న నేతలు

తుదిశ్వాస వరకూ ఎర్రజెండా బాటలోనే..
సంతాప సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తణుకు

చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించిన వ్యక్తి దొంగ సత్యనారాయణ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో దొంగ సత్యనారాయణ సంతాప సభ కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 44 సంవత్సరాల నుంచి దొంగ సత్యనారాయణ సిపిఎం సభ్యులుగా తాను, తన భార్య ఉండటం పార్టీ పట్ల వారికి, వారి కుటుంబాలకు ఉన్న విశ్వాసమని అన్నారు. పార్టీలో పనిచేస్తూ గ్రామంలోని, మండలంలోని ప్రజల సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొని పోరాడిన వ్యక్తి అని గోపాలన్ అన్నారు. జిల్లా నాయకులుగా పనిచేస్తూ కౌలు రైతుల సమస్యలపై అనేక వినతిపత్రాలను ప్రభుత్వ అధికారులకు అందజేసి కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బళ్ల చినవీరభద్రరావు, చేతివృత్తుల జిల్లా నాయకులు ఇల్లిందరపర్తి సత్యనారాయణ, సిపిఎం శాఖ కార్యదర్శి పిల్లి కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు పాల్గొన్నారు.


ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామరాజు

ఎస్ఐను కలిసిన రామరాజు

నరసాపురం: ఇటీవల నరసాపురం పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్.జయలక్ష్మి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుని పట్టణంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రామరాజుకి ఎస్ఐ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐకు అభినందనలు తెలిపిన రామరాజు పట్టణంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని సూచించారు. టిడిపి నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, అధికారి అనంత రామారావు, కొప్పాడ రవి, పెండ్ర శీను, జక్కం కాశి, దొంగ పద్మారావు పాల్గొన్నారు.

9 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటికే పరిమితమైన అనారోగ్య వృద్ధులకు సంచారశకటం ద్వారా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఉచిత వైద్యసేవలు అందజేశారు. తణుకు, ఎస్.ఇల్లిందరపర్రు, వేల్పూరు, కె.సావరం ప్రాంతాల్లో పర్యటించి 9 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు జీపు బహూకరణ

తాడేపల్లిగూడెం: జీపు లేక ఇబ్బంది పడుతున్న ట్రాఫిక్ పోలీసుల అవస్థలకు స్పందించిన ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఐదున్నర లక్షల సొంత నిధులతో కమాండర్ జీపును బహూకరించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్రహ్మణ్యంకు జీప్ తాళాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిధుల లేమితో ఉన్న నేపథ్యంలో కొన్ని కొన్ని పనులు నాయకులు, ప్రజలు సహకరించవలసిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్. కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు ఆర్కిడ్జ్ స్కూల్లో కరాటే గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. పాలకొల్లు, భీమవరం, నరసాపురం జోన్లకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ పోటీలకు చీఫ్ ఎగ్జామినర్‌గా మలేషియాకు చెందిన డాక్టర్ టోని పొన్నయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథి ఆర్కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ ఎంపి జానకి రామ్ మాట్లాడుతూ శారీరక ధృఢత్వాన్ని కలిగిన విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉంటారని, విద్యార్థులలో ఏకాగ్రత, కాన్ఫిడెన్స్ పెంపొందటంతో పాటు క్రమశిక్షణ, ఆత్మరక్షణకై కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. బాలికలకు, మహిళలకు నేటి సమాజంలో అత్యావశ్యకమైనది విద్య అని, అందుకే ఆర్కిడ్జ్ స్కూల్లో రెగ్యులర్ అకడమిక్స్‌తో పాటు యోగ, వెస్ట్రన్ డాన్స్, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు అధిక ప్రాముఖ్యత ఇంటుందని తెలిపారు. వివిధ జోన్లనుంచి విచ్చేసిన కరాటే మాస్టర్లు ఎం.శాలేంద్రమ(మదురై) దాస్ మలేషియా, జోన్సులు నాగేశ్వరరావు కరాటేలో అనేక మెళకువలను నేర్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్టాండ్ అభివృద్ధి పనుల పరిశీలన

ఉండి : ఉండి బస్టాండ్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి అత్యాధునిక హంగులతో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఉండి బస్టాండ్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను రఘురామకృష్ణంరాజు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉండి బస్టాండ్ అభివృద్ధికి నోచుకోక ఆమడ దూరంలో నిలిచిపోయిందని, తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు దాతల సహకారంతో తన వంతు కృషి చేస్తున్నానని ఆయన వివరించారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కాగిత బుజ్జి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

ఉండి : మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో ప్రభుత్వ రేషన్ దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న వెయ్యి కేజీల రేషన్ బియ్యాన్ని వాహనంతో సహా గ్రామస్తులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మోరంపూడి మహేశ్వరరావు మాట్లాడుతూ రేషన్ దుకాణం యజమానిపై ఆంధ్రప్రదేశ్ నిత్యవసర వస్తువుల చట్టం ప్రకారం 6 ఎ కేసు నమోదు చేసి, వాహన డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆ దుకాణాన్ని తాత్కాలికంగా వేరే వారికి అప్పగించి, రేషన్ కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా సరుకులు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మొగల్తూరు : నలుగురు యువకులు లైంగికంగా వేధించడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కవారి గ్రామానికి చెందిన విల్లూరి రమేష్, నక్క ప్రసన్న కుమార్, పాలపర్తి కిషోర్, ఇంజేటి నరసింహ స్వామిలు గ్రామానికి చెందిన ఒక మహిళను లైంగికంగా వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై మనస్తాపం చెందిన ఆమె ఈనెల 14న ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె భర్త విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వినాయకుని ఊరేగింపులో రాళ్లదాడి


నరసాపురం : మండలంలోని లింగనబోయినచర్ల బైనపాలెం సెంటర్లో వినాయక చవితి ఊరేగింపులో రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు చోటుచేసుకున్నాయి. నాలుగురోజుల క్రితం జరిగిన ఊరేగింపులో గొడవ జరగగా మరలా ఆదివారం సాయంత్రం నుంచి గొడవ ప్రారంభమైంది. ఈ దాడిలో మొగల్తూరు కానిస్టేబుల్ రాజేష్‌కు గాయాలయ్యాయి. డీజెకు సమయం అయిపోవడంతో మరో సారి కొనసాగించాలని ఒక వర్గం కోరగా మరో వర్గం వద్దని వాదనలు చేసుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రూరల్ సిఐ డి.దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, రూరల్ ఎస్ఐ సురేష్ సంఘటనాస్థలానికి చేరుకుని సర్దుబాటు ప్రయత్నం చేయగా ఇరువర్గాలు రాళ్ల దాడి చేసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో పికెటింగ్ ఏర్పాటుచేశారు.

సాంకేతికరంగ ప్రగతితోనే నిర్మాణ రంగం

ఘనంగా జాతీయ ఇంజినీర్ల దినోత్సవం
పలుచోట్ల ఇంజినీర్లకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సాంకేతికరంగ ప్రగతితోనే నిర్మాణ రంగం ప్రకాశవంతమని రైల్వే డివిజనల్ ఇంజనీర్ అందే శంకర్ రామాంజనేయులు అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ సంయుక్త అధ్వర్యంలో భీమవరం రైల్వే జంక్షన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీర్ శంకర్ రామాంజనేయులు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతదేశ సాంకేతిక రంగం ప్రగతి పథంలో ఉందని, దశాబ్దాల క్రితమే సాంకేతిక నిర్మాణంలో భారతదేశం ముందంజలో ఉందని, విశ్వేశ్వరయ్య సాంకేతిక రంగంలో ఆధ్యుడని, అభివృద్ధిలో కీలకం ఇంజనీర్లు అని అన్నారు. భీమవరం రైల్వే ఇంజనీర్లు వై.రాంబాబు(ఐడబ్ల్యుఎస్ సిఎం), కె.మనోహర్(ఎస్ఎస్ఇ ఇసిజి ఎలక్ట్రికల్), మోహన్(ఎస్ఎస్ఇ ఒహెచ్), సయ్యపురాజు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఇంజనీర్ లేనిదే అభివృద్ధి లేదని, విశ్వేశ్వరయ్య నదులకు ఆనకట్టలు నిర్మించి దేశ ఆర్థిక పరిపుష్టికి, ప్రగతికి బలమైన పునాదులు వేశారని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, యువ ఇంజనీర్ భట్టిప్రోలు మధుసుధన్ రావు(నూజివీడు) మాట్లాడుతూ దేశ పునర్నిర్మాణంలో ఇంజనీరింగ్ నిపుణుల అవసరం ఎంతో ఉందని, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ సేవలు ఎంతో అవసరం ఉందన్నారు. భీమవరంలోని యనమదుర్రు డ్రెయిన్‌పై రైల్వే బ్రిడ్జికి ఆనాడే దంతులూరి నారాయణరాజు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరు నామకరణం చేశారని అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు, కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జనపాటి మధుసుధన్ రావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్, ఎస్కె.పచాన్ భాషా మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. అనంతరం ఆరుగురు ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లుల సీతారామ్ ప్రసాద్, కె.రాంప్రసాద్, రైల్వే ఎస్ఎం.చక్రవర్తి పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం : ఎపి నిట్‌లో..

ఉండి : భారతదేశం గర్వించే గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. ఆదివారం ఉండి లయన్స్ క్లబ్ తరపున ఉండి కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ గల వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. యువ ఇంజనీర్లు వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజులు మాట్లాడారు. అనంతరం సివిల్ ఇంజనీర్లు రుద్రరాజు వెంకట రామరాజు, సోమిశెట్టి జయప్రకాష్‌లను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి భూపతిరాజు హరినాథరాజు ఆర్థిక సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలతీర్థపు నరసింహారావు, కలిదిండి సీతారామరాజు, కాగిత మహంకాళి, బుద్ధరాజు సుబ్బరాజు, బొండాడ కేశవరావు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, మంతెన రంగప్రసాద్ రాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఇంజనీర్లు దేశ ప్రగతికి రూపశిల్పులని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్ తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద ఇంజనీర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఇంజనీర్లు చేస్తున్న నిర్విరామ కృషి వెలకట్టలేనిదన్నారు. మనదేశ ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన గొప్ప ఇంజనీర్, భారతదేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, సాస్ అసిస్టెంట్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకోడేరు : అద్వితీయమైన మేధస్సుతో ఎన్నో సివిల్ ఇంజనీరింగ్ కట్టడాలకు ప్రాణం పోసిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్ల డేగా నిర్వహించుకుంటున్నామని శృంగవృక్షం జెడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగన్నాథం అన్నారు. స్థానిక పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకోడేరు మండలం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. పాలకోడేరు ట్రాన్స్ కో ఎఇ ఆర్‌వి.అప్పారావు, పంచాయతీరాజ్ ఎఇ వివిఎస్.విజయకుమార్ రాజు, హౌసింగ్ ఎఇ బిహెచ్ బి.నరసింహరాజు, ఉండి హౌసింగ్ రిటైర్డు ఎఇ డి.రామకృష్ణ రాజు, ఎంఇస్ రిటైర్డు ఎఇ ఎన్‌విఆర్‌ఆర్.సత్యనారాయణలను లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సన్నిధి పాలేశ్వరరావు, వెంకటరత్నం చౌదరి, పురుషోత్తం, వెంకటరాజు పాల్గొన్నారు.

ఫుడ్ ఫ్యాట్స్ సేవలు అభినందనీయం
ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : ఫుడ్ ఫాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ సేవా విభాగం స్వాభిమాన్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వాభిమాన్ ఫౌండేషన్ అనాథ శరణాలయం ప్రాంగణంలో ఆదివారం పిల్లల ఉచిత గుండె వైద్య చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అధినేత ఒపి.గోయింక, సుశీల్ గోయింక చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. చిన్నపిల్లలకు పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత వ్యాధులకు ఆపరేషన్లు చేయించడం అనేది సామాన్య విషయం కాదని, ఒకొక్క ఆపరేషన్‌కు రూ.8 నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుందని, ఇలాంటి బృహత్తర కార్యాక్రమాన్ని స్వాభిమాన్ ఫౌండేషన్ ద్వారా చేయడం ప్రశంసనీయమన్నారు. అలాగే తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ఎల్‌కెజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించడంతో పాటు, అత్యధిక సదుపాయాలతో హాస్టల్ ఏర్పాటు చేశారన్నారు. దీంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీరు కలుషితమయ్యే ప్రదేశాల్లో ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయడం కూడా ప్రశంసనీయమన్నారు. ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ యాజమాన్యం, సిబ్బంది, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆపన్నులకు 'మానవత' చేయూత

ఆచంట : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవా దృక్పథంతో ముందుకు నడిపిస్తున్నామని మానవత సంస్థ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. మానవత మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డయాలసిస్ పేషెంట్ దుద్దిపూడి శ్రీనివాస్‌కు మందుల నిమిత్తం రూ.5 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు, జిల్లా మానవత ఆడిట్ కమిటీ సభ్యులు నెక్కంటి శివన్నారాయణ, అడ్వైజరీ కమిటీ కో చైర్మన్ వేంద్ర శ్రీనివాస్, ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు కంచర్ల శివ, ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ, కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వరరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండా బత్తుల ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

పాము కాటుతో బాలిక మృతి

ఉండి: పాముకాటుకు ఏడేళ్ల బాలిక మృతిచెందిన సంఘటన మండలంలోని మహదేవపట్నం గ్రామంలో చోటుచేసుకుంది. బాలిక బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహదేవపట్నం గ్రామంలోని సాలిపేటకు చెందిన తుమ్మిడి మధుర మూడో తరగతి చదువుతుందని, శనివారం రాత్రి 7 గంటల సమయంలో వీధిలో ఆటలాడుకుంటుండగా తాచుపాము కాటు వేసిందన్నారు. స్థానికుల సహాయంతో తండ్రి తుమ్మిడి సతీష్ భీమవరంలోని రాజర్షి ఆసుపత్రికి తరలించగా చికిత్స చేస్తున్న సమయంలో బాలిక మృతి చెందిందని, ఆదివారం ఉదయం గ్రామంలో ఖననం చేసినట్లు తెలిపారు. తుమ్మిడి సతీష్, లక్ష్మీ దుర్గ దంపతులకు కవలలు జన్మించగా వారిలో పెద్ద కుమార్తె మధుర మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


కాళ్ల : వినాయకుని దర్శించుకుంటున్న మాజీ ఎంఎల్ఎ రామరాజు

పలుచోట్ల అన్నసమారాధన

కాళ్ల : వినాయకచవితి సందర్భంగా కలవపూడి గ్రామంలో జరుగుతున్న శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఉండి మాజీ ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. కలవపూడి గ్రామంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనకు వేలాది మంది భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మంతెన పెద నరసింహరాజు, వినాయక ఉత్సహకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాళ్ల : జువ్వలపాలెం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అఖండ అన్నసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతి రాజు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకుని, అఖండ అన్నసమారాధన నిర్వహించామని తెలిపారు. అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి గోకరాజు వినోద్ బాబు, ఉత్సహ కమిటీ సభ్యులు దాట్ల వెంకట రామరాజు, ముదుండి సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో ఆదివారం అన్న సమారాధన చేశారు. వినయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.


కాళ్లలో అన్నసమారాధన

స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలి
బ్రోచర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ అంజిబాబు


ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ-2024లో అందరూ భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ-2024 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్రమంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమిష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించటమే ధ్యేయంగా ముందడుగు వేయాలని, ఈ పదిరోజులు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన పరిశుభ్రతే మన ఆరోగ్యమని, పరిసరాల పరిశుభ్రత సమాజ శ్రేయస్సు అని, దేశ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, చల్లా రాము, ఆకుల కృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 వేల చెక్కును పాలకొల్లు జనత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కొఠారి మిథున్ చౌదరి దంపతులు అందించారు. ఈమేరకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయం పాలకొల్లులో కలిసి అందించారు. వారిని మంత్రి అభినందించారు. విజయవాడ వరద భాదితులకు వివిధ వర్గాలు అందిస్తున్న సహాయ సహకారాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.


పాలకొల్లు : మంత్రికి చెక్కును అందిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం : ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపుమేరకు ఆదివారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తాడేపల్లిగూడెం క్రైస్ట్ లూథరన్ చర్చి సంఘం తరపున విరాళాలు సేకరించారు. రూ.లక్ష, విఘ్నేశ్వర హోల్సేల్ పండ్ల వర్తకసంఘం రూ.50 వేలు, నడింపల్లి సత్యనారాయణ రూ.50 వేలు, వీరంపాలెం శ్రీకేతిరెడ్డి రాంబాబు రూ.25 వేలు, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ రూ.32,500, మారంపల్లి రజక సంఘం రూ.10 వేలు, అమృతాపురం సుబ్బరాజు రూ.25 వేలు, విరాళాన్ ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. విరాళాలను అందజేసిన దాతలకు ఎంఎల్ఎ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని దాతలు ఇంకా ఎవరైనా ఉంటే ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

'సూర్య ఘర్ యోజన'ను వినియోగించుకోవాలి
కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లు రాయితీపై అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటి కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు లేదా100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ కెపాసిటీ 1 నుంచి 2 కిలో వాట్స్, 2 నుంచి 3 కిలో వాట్స్, మూడు కిలో వాట్స్‌పైన ఉండే కెపాసిటీలలో సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవచ్చని, ఇందుకు రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చన్నారు. ఇది ఎంతో మంచి పథకం అని, ఒకసారి ఇంటిపైన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏళ్ల తరబడి దాని నుంచి లబ్ధి పొందవచ్చని తెలిపారు. సౌర విద్యుత్ శక్తిని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకోడానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారునికి ప్రస్తుతం వస్తున్న బిల్లు రూ.1000 ఉంటే సోలార్ పవర్ బిల్లు కేవలం రూ.338 వస్తుందని అన్నారు. సోలార్ రూఫ్ ఏర్పాటు కోసం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. www.pmsuryaghar.gov.in/apepdcl webite ద్వారా లేదా పిఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం గురించి గ్రామాల్లో, పట్టణాల్లో డోర్ టు డోర్ ప్రచారం చేయాలని, కరపత్రాల పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు.

సీనియర్ పాత్రికేయుడు రామకృష్ణారావు మృతి

ఆకివీడు : ఆకివీడులో సీనియర్ పాత్రికేయుడుగా గుర్తింపు పొందిన కిమిడి రామకృష్ణారావు(90) మృతిచెందారు. గత కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా మృతిచెందినట్టు ఆయన కుమారుడు జర్నలిస్ట్ సుబ్బారావు తెలిపారు. చనిపోయిన ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య సావిత్రమ్మ కొంతకాలం క్రితం మరణించారు. కుమారుడు సుబ్బారావు ప్రస్థానం పత్రికా రంగంలో ఉన్నారు. రామకృష్ణారావు సుమారు ఆరు దశాబ్దాలుగా పత్రికా రంగంలో పనిచేశారు. 1962 ప్రాంతంలో ఏజెంట్‌గా ఆంధ్రా పత్రిక ఏజెంట్‌గా ఆయన పత్రికారంగంలో జీవితం ప్రారంభించారు. క్రమంగా అదే పత్రికలో విలేకరిగా బాధ్యతలు చేపట్టారు. 1974లో 'తెలుగు జిలుగు' అనే పేరుతో పక్షమాస పత్రిక కొంతకాలం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి పత్రికలు ఏజెంట్ విలేకరిగా కూడా ఆయన విధులు నిర్వహించారు. స్వాతి వార పత్రికకు కూడా ఆయన ఏజెంట్‌గా చాలాకాలం కొనసాగారు. అనంతరం కొల్లేరు టైమ్స్ పేరుతో మరో పత్రికను ప్రతిపాదించి సాంకేతిక కారణాలతో అప్పు చేసేశారు. 1982లో టిడిపి జెండా చేతపట్టిన ఆయన ఆకివీడు తాలూకా కేంద్రాల్లో పట్టణ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో తొట్టదలి అక్రిడేటెడ్ జర్నలిస్టుగా పట్టణంలోని గాక తాలూకాలో సైతం ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆయన భార్య సావిత్రమ్మ మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ఆకివీడు తాలూకా పంచాయతీ సభ్యులుగా రెండుసార్లు పనిచేశారు. ప్రస్తుతం ఆయన కోడలు కిమిడి అరుణకుమారి నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని ప్రముఖులు మాజీ పిసిసి సభ్యులు కనుమూరు అబ్బాయి రాజు, టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, సిపిఎం నాయకులు కె.తవిటి నాయుడు, సందక సూరిబాబు, దోకల రవి, బివి.వర్మ, సంతాపం వ్యక్తం చేశారు.

రక్షిత తాగునీరందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆచంట

రక్షిత మంచినీరు ఇంటింటికీ అందించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. జిన్నూరులో సిపిఎం శాఖా సమావేశం దాడి గౌవరమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. జిన్నూరు నుంచి ఆరు కిలో మీటర్లు దూరం పాలకొల్లు వెళ్లి తాగునీరు సైకిల్ పై తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సురక్షితమైన తాగునీరు ఇంటింటికీ అందించాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో శాఖా కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి, సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ, కేతా సత్యనారాయణ, గుబ్బల గంగాజలం, కలిశెట్టి సింహాచలం, వెలదూటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

19 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

ప్రజాశక్తి - వీరవాసరం

అక్టోబర్ 19 నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి అండర్-14, 17 బాలబాలిక మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు ఆయా మండల కేంద్రాలలో ప్రారంభమవుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాలలో నిర్వహించే ఈ పోటీలు అక్టోబర్ 19, 20, 21న మండల స్థాయిలోను, అదేనెల 23, 24 తేదీలలో నియోజకవర్గస్థాయిలోను ఎంపికలు ఉంటాయన్నారు. ఇదేవిధంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 జూడో జట్ల ఎంపికలు ఈనెల 18న ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఈ ఎంపికలకు పాలిటెక్నిక్, ఐటిఐ చదువుతున్న వారికి అర్హత లేదన్నారు.